

# బూరుజూవాస్

“ఈ బూర్జువా రైళ్లు ఎప్పుడూ ఇంతే, ఒక్కటీ టైముకు వచ్చి చావదు గదా? ” ఆగ్రహించేరు, శ్రీ సుబ్బయ్యగారు.

“బూర్జువా ఏంటండీ? ” ఆశ్చర్యపోయేన్నేను.

బుర్ర గోక్కున్నారాయన. “పోనీ, కాపిటలిస్టు రైళ్లనుకుందాం. ఇవి చాలా ఖరీదు గనుక! బస్సుల్నయితే డబ్బాడు పెట్రోలుతో... ఆ మాటకొస్తే అసలు పెట్రోల్ డబ్బా ఎందుకూ, ఆ బస్సుకు ఉండే ట్యాంకులోని పెట్రోల్తోనే తగలెట్టొచ్చు. రైళ్లు అంత తేలిగ్గా తగలడవు. కనుక అవి కేపిటలిస్ట్ సరుకే” ఉద్ఘాటించేరాయన.

“చూడండీ, నేనీ ఊరొచ్చి స్థిరపడ్డ కొత్తలో హైదరాబాద్ వెళ్ళాలంటే రైలు ఛార్జి మూడున్నర రూపాయలుండేది. మరి ఇపుడెంతా...? ” ప్రశ్నించారాయన.

“ముప్పయ్యయిదు రూపాయలనుకోండీ”

గుండెలు బాదుకోబోయేరు శ్రీ సుబయ్యగారు. “మరింకా సందేహమెందుకు మీకు. ఇందంతా కాపిటలిస్ట్ దోపిడీయే. ఇవి అక్షరాలా కాపిటలిస్ట్ రైళ్లే”

“అందుకేనన్నమాట మీ వాళ్లు రైళ్లు పేల్చిపారేస్తున్నారు? ” సందేహించేన్నేను.

“మా వాళ్లెవరూ? ” అనుమానంగా చూసేరాయన.

“నక్సలైట్ల వలన చాలా లాభాలున్నాయని మీరు తరచూ అంటూంటారు గదాండీ”

“అవునులెండి. అంతమాత్రాన వాళ్లు నా వాళ్లెలా అవుతారూ, ఇంకానయం. నన్నో నక్సలైటుగా జమ కట్టేశారు కాదు. అసలే రోజులు బాగాలేవు” అంటూనే అనుమానంగా ఓసారి చుట్టూ చూసేరు శ్రీ సుబ్బయ్యగారు.

ఆ నిమిషాన్న మేమిద్దరం కాజీపేట స్టేషన్లో బెంచీమీద సుఖాశీనులమై ఉన్నాం. అర్ధరాత్రి కావటంవల్లనేమో సందడి అంతగా లేదుగానీ, జనం బాగానే ఉన్నారు. మరో అరగంటలో రాబోయే ఓ కాపిటలిస్ట్ రైల్లో ఆయన కూతురూ అల్లుడూ దిగబోతున్నారు! నేను అదే రైలెక్కి హైదరాబాద్ వెళ్లబోతున్నాను.

“అయితే బస్సులు ఫర్వాలేదనుకుంటాను. ‘ప్రజాసేవయే మా కర్తవ్యం’ అని ప్రతి బస్సూ పెద్దక్షరాల్లో ప్రతిజ్ఞ చేస్తోందిగదాండీ”

"బస్సులూ రైళ్లూ అన్నీ గవర్నమెంటువే గదా! అవి ప్రజలవెలా అవుతాయి? "

"మీరు పన్నులు కడుతున్నారా? "

"ఏముందీ ఏదో శిస్తు అనీ, అదనీ ఇదనీ పావలా, పరకా కడుతుంటాం. మీ పట్నం వాళ్లలా ఇన్‌కంటాక్సులు గట్రా కట్టేంత బూర్జువాలం కాముగదా"

"నేను టాక్సు కడుతున్నా సరే! నాకు కనీసం సైకిలన్నా లేదు. మీకేమో కారు లేకున్నా మోటార్‌సైకిలుంది. మళ్లీ మాట్లాడితే ఓ డొక్కు జీపు కూడా ఉంది. ఆ లెక్కన మీరు సెమీ బూర్జువా అయ్యుండాలి గదా"

"ఏం బూర్జువానో గానీ, ఈ మధ్య మా ఊళ్లో నోరున్న ప్రతివాడూ ఆ జీపో, ఈ బైకో అరువడిగేవాడే. కాదంటే ఎవడేం చేస్తాడోనని భయం! ఎంతైనా ప్రజా ప్రభుత్వం గదా!"

"అంటే ప్రజలు డ్రైవింగులు గట్రా నేర్చేసుకుని గొప్ప మెకానిక్కులూ, ఇంజనీర్లూ అయి పోతున్నారనా...?

"మోటారు బైకు నడపడానికి ఇంజనీరింగెందుకండీ! మా ఊరికొచ్చే బస్సులన్నీ తగలేశారు గదా! ఎవడికే అవసరం వచ్చినా పది మైళ్లు నడిచి మెయిన్రోడ్డు మీదికెళ్లి బస్సెక్కాల్సిందే నయ్యే"

"అదేమిటండీ, తమ బస్సుల్ని తామే తగలేసుకుంటారా ప్రజా ప్రభుత్వం వారు"

"మీకింకా విప్లవం వంటబట్టినట్లు లేదు. ప్రజాప్రభుత్వం అంటే మా ఊళ్లో ఎర్రజెండా ఎగరేసి 'ఇహ మీదట పాలకులం మనమే. ప్రభుత్వం మనదే' అని ఉద్ఘాటించి బస్సులు తగలేసిన వాళ్లది. మీరు అనుకునే ప్రజా ప్రభుత్వం హైదరాబాదులో ఉన్న బూర్జువా బస్సులు నడిపేవాళ్లది. తప్పితే ఢిల్లీలో ఉన్న కేపిటలిస్టు రైళ్లు నడిపేవాళ్లది"

"మరయితే మొన్నెవరో ఆర్టీసీ ఆయన గత ఏడాదిలో నూట అరవయ్యయిదు బస్సులు పూర్తిగా తగలేయబడెను. మరికొన్ని వందల బస్సులు సగం సగం తగలేయగానే ఆర్పివేయ బడెను. నష్టం పన్నెండు కోట్లుండనోపును" అన్నారే! ఇదంతా మీ ఊరి విప్లవ ప్రజా ప్రభుత్వం వాళ్ల ఘనకార్యమేన్నమాట"

"ఆఫ్టరాల్ పన్నెండు కోట్లేగదా! నిన్నగాక మొన్న ఈ మాటలన్నవాళ్లే నాలుగు రోజుల ఆలిండియా కాంగ్రెస్ మహాసభల బాగోతానికి తిరుపతి దగ్గర ఏదో చెరువులో ఎన్ని కోట్లు గుమ్మరించలేదు గనుకా!"

"బోడిగుండుకూ మోకాలికీ ముడేస్తే ఎలాసార్!"

"అవున్లెండీ! మీకెలా అర్థమవుతాయి మా పల్లెటూళ్ల సంగతులు. పోనీ జీపు తీసుకొచ్చే నుగదా, మీరూ మా ఊరికి రాగూడదూ. మీకే అన్నీ తెలుస్తాయి గదా"

"ఏమేం తెలుసుకోవాల్సి ఉందంటారూ? "

"బూర్జువాలూ, బడా బూర్జువాలూ గ్రామీణ శ్రామికుల్నెలా దోచుకుంటున్నారో, నక్సలైటు ప్రజా ప్రభుత్వం వారు సదరు బూర్జువాల తోకలు నరికి పేదల్నెలా ఉద్ధరిస్తున్నారో మీరు చూసి తీరాలి సుమండీ"

"నిజంగానే...? "

"మీరు నమ్మరు గానీ, మా ఉళ్లో ఇపుడొక్క బూర్జువాగాడు కూడా లేడు. అందరూ ఇళ్లకు తాళాలేసి వరంగల్లుకో, హైదరాబాదుకో ఉడాయించేసేరు"

"ఈ మధ్య మిలిటరీ దిగాక వాళ్లంతా మళ్లీ వస్తున్నారంటున్నారే? "

"అదెంత కాలంలెండి! ఆ బూర్జువా, ఈ మిలిటరీ వాళ్ల నరహింసకు, వ్యతిరేకంగానేగదా

ఇందాకా మీరు చెప్పిన 165 బస్సుల్నీ విప్లవ ప్రజలు తగలేసిందీ"

"బస్సులు తగలేయగానే ప్రజలు కడుపునిండా తిని సుఖపడనారంభించారన్న మాట"

"మీరలా కేపిటలిస్టులా మాట్లాడగూడదు. అదోరకం ప్రతీకారం. ప్రభుత్వం దాని తడాఖా అది చూపిస్తోంది. వీళ్లు తమ సత్తా తాము చూపిస్తున్నారు"

"నేను గవర్నమెంటు నౌకర్నయినంతమాత్రాన దాన్ని నెత్తినేసుకు రావటం లేదండీ! మరయితే నిన్న దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌ని పడగొట్టిన దానికేమంటారూ? "

"అది కాస్త ఆలోచించాల్సిందే సుమండీ! మనం బస్సులంతగా ఎక్కకపోయినా, అప్పుడప్పుడూ అయినా రైళ్లెక్కక తప్పదు గదా"

"అలా దారికి రండి. మీరు మీ భాషలోనే బూర్జువా నుంచి కాపిటలిస్టు ప్రయాణీకులైపోయేరన్నమాట! సరేగానీ, అల్లుడిని ఏమాత్రం పెట్టి కొనుక్కొచ్చేరూ? "

"కొనేందుకేముందీ! కట్నం అంటూ పైసా ఇవ్వలేదు. ఉన్నది ఒక్క కూతురేగదా! పాతికెకరాల తోటా, యాభయ్యేకరాల పొలం రేపు అనుభవించేది వాళ్లే గదా! అన్నట్లు రైలొచ్చే టైమయింది, ఇహ లేద్దామా, కాస్త మొహాలు కడుక్కుని చాయ్ త్రాగి..."

ఇంతలో స్టేషన్లో కలకలం మొదలయింది. అంటే రైలు రాబోతోందన్నమాట.

మేం లేచి 'చల్లని తాగేనీరు' అని రాసి ఉన్న పంపు దగ్గరకు వెళ్తుండగా, స్టేషన్‌మాస్టర్ గది దగ్గర ఏదో హడావిడి, రైల్వే వాళ్ల పరుగులు, టెలిఫోన్ల మోత, ఉద్యోగుల కేకలు.

స్టేషన్ అంతా నిద్రలేచింది. సగానికి సగం మంది ఎటెటో పరుగులు తీస్తున్నారు. కదలకుండా ఉండిపోయిన వాళ్ళ కళ్లల్లో భయం... భయం.. శరీరాల్లో వణుకు... భయం... భయం.

అదేమిటో అర్థంగాక ఎంక్వయిరీకేసి వెళ్లాం. కానీ, అతను మమ్మల్ని పట్టించుకునే స్థితిలో లేడు. ఫోన్‌లో ఎవరినో బ్రతిమాల్తున్నాడు. "అర్జంట్... అర్జంట్... అంబులెన్సులు, డాక్టర్లు, నర్సులు, కాంపౌండర్లు కాజీపేట్, హసన్‌పర్తి - అర్జంట్..." అంటూ ప్రాణభయంతో హడలిపోతున్నవాడిలా ఫోనులో అరుస్తున్నాడు.

మేం కొంచెం ఓపిక పట్టేం. ఈలోగా ఆ హడావిడికి మా కాళ్లూ వణకసాగేయి.

మరి కాసేపటికి మాకు అర్థం అయిందాని ప్రకారం కాజీపేటకో పాతిక, ముప్పై మైళ్ల దూరంలో నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌ను ఎవరో పడగొట్టేరు. నలుగురు చచ్చేరు. నలభైమందికి కాళ్లూ, కీళ్లూ ఊడేయి.

నిల్చున్నపళంగా నిలువెల్లా వణికిపోతూ, కాళ్లలో సత్తువ కోల్పోయిన వాడిలా నా మీదకు వాలిపోయేరు, శ్రీ సుబ్బయ్యగారు.

"అమ్మాయి.. అల్లుడు... అమ్మాయి..." గొణుగుతున్నాడాయన.

నెల క్రిందటే ఆయన అల్లుడుగా మారిన సదరు కుర్ర డాక్టర్ ఆ రైల్లోనే సతీసమేతంగా వస్తున్నాడు. నేనా రైల్లోనే అర్జంటుగా హైదరాబాదు చేరవలసి ఉన్నాను.

ఇంకెందరో... ఎక్కడెక్కడికో...!

("ఈనాడు"-13.5.1992)

☆

గ్రంథాలయం శ్రీకాకుళం